క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన రాజు

ఆదోని అర్బన్ : ఈనెల 16న జరిగిన సీనియర్ కబడ్డీ క్రీడాకారుల ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపిన ఆదోని విద్యార్థి డి.కె.రాజు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు పీఈటీ అసోసియేషన్ సభ్యులు రామన్న, హరిబాబు, సీనియర్ క్రీడాకారులు చిన్నా, హుసేని, కృష్ణ, చంద్ర, సురేంద్ర పోటీలకు ఎంపికైన రాజును అభినందించారు. రామన్న మాట్లాడుతూ పీఈటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజుకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చామని చెప్పారు. రాజు ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ చదువుకున్నాడని, ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు విశాఖపట్నంలోని అంకుపాలెంలో జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ కబడ్డీ పోటీల్లో కర్నూలు తరఫున పాల్గొంటాడని వివరించారు.

చెట్నేహళ్లిలో పొలంబడి

మంత్రాలయం రూరల్: మండలంలోని చెట్నేహళ్లి గ్రామంలో వ్యవసాయశాఖ ఏడీఏ ఖాద్రి, ఏఓ జీరా గణేష్ ఆధ్వర్యంలో పొలం బడి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పరిసరాల పర్యావరణ విశ్లేషణ కార్యక్రమంలో భాగంగా వేరుశనగ పంట స్థితిపై రైతులకు అవగాహన కల్పించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. సర్పంచ్ ఆంజినేయులు, ఉప సర్పంచ్ వీరనాగుడు,అధికారులు ఉన్నారు.

డీలర్లు నిబంధనలు పాటించాలి

కౌతాళం: రేషన్ డీలర్లు నిబంధనలు పాటించాలని ఇన్‌చార్జ్ తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని రేషన్ డీలర్లలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ డీలర్లు స్టాక్‌బోర్డు తప్పనిసరిగా చూసుకోవాలన్నారు. అధికారులు తనిఖీ నిమిత్తం వచ్చిన ప్పుడు స్టాక్ సక్రమంగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వం అందజేస్తున్న నిత్యవసర వస్తువుల్ని ప్రతి కార్డుదారుడికి అందేలా చూడాలని, తక్కువ తూకం ఇవ్వరాదని ఆదేశించారు. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

భూ హక్కు పత్రాల పంపిణీ


పత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

కౌతాళం: మండలంలోని వీరాలదిన్నె గ్రామంలో రైతులకు జగనన్న భూహక్కు పట్టాదారు పాస్ పుస్తకాలను బాపురం నాయకులు గురునాథ్‌రెడ్డి, జైపాల్ బుధవారం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష పథకం రైతులకు వరంలాటిందని తెలిపారు. త్వరలోనే బా పురం వంతెన పూర్తవుతుందని చెప్పారు. వీరాలదిన్నె గ్రామంలో మొదటి విడతలో 312 మంది రైతులకు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ రామాంజనేయులు. దశరథరెడ్డి, గిరిస్వామి, గోవిందు, రైతులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఆదోని అర్బన్ : రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధన కోసం విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన సమరయాత్రను జయప్రదం చేయాలని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు షాబీర్‌బాషా, నాగరాజ్, శ్రీనివాసులు, అఖండ, రమేష్ కోరారు. బుధవారం స్థానిక భీమాస్ ఫంక్షన్ హాల్‌లో సమరయాత్రకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు హిందూపురం నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేకహోదాతో పాటు రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, కడప ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 21న కర్నూలు జిల్లాకు సమరయాత్ర చేరుకుంటుందని చెప్పారు. దస్తగిరి, మల్లికార్జున, ప్రభ, గణేష్ పాల్గొన్నారు.

మైదానం ఏర్పాటు చేయాలి

ఆదోని రూరల్: గ్రామాల్లో మైదానాలు ఏర్పాటు చేసి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు కోరారు. బుధవారం మండలంలోని సంతెక్కూడూరు గ్రామంలో కేవీపీఎస్ గ్రామ సమావేశం పరమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు ఇప్పుడిప్పుడే జాతీయ స్థాయిలో ఆడే స్థాయికి చేరుకుంటున్నారని, మరింత మంది వెలుగులోకి రావాలంటే ప్రభుత్వ చేయూత అవసరమన్నారు. ఇందులో భాగంగా మైదానాలు ఏర్పాటు చేసి వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు మునిస్వామి, తిక్కప్ప, కేజీబీఎస్ పట్టణ అధ్యక్షులు యువరాజు, గ్రామ కార్యదర్శి సిద్ధప్ప, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

22 నుంచి ఆరాధన

ఆస్పరి: మండలంలోని తంగరడోణ గ్రామంలో వెలసిన చింతలమునిస్వామి, నల్లారెడ్డి స్వామి ఆరాధనోత్సవాలు ఈనెల 22, 23వ తేదీలలో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పార్వతి బుధవారం తెలిపారు. రెండు రోజుల పాటు ఆలయాల్లో గంగ, ఆకు పూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులకు ఏర్పాట్లు చేసినట్లు చైర్‌పర్సన్ తెలిపారు.

అంబులెన్స్‌లోనే కాన్పు - సుజాత, కందుకూరు



నా భర్తది ఎమ్మిగనూరు. మొదటి కాన్పు ప్రసవం నిమిత్తం నా పుట్టినిల్లు కందుకూరు గ్రామానికి వచ్చా. గత నెల 21న పురిటినొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌కు సమాచారం అందజేశాం. మా గ్రామం మండల కేంద్రం నుంచి 20 కి.మీ. దూరంలో ఉంది. ఆసుపత్రికి వచ్చేలోపు దారిలోనే అంబులెన్స్‌లో మగబిడ్డకు జన్మనిచ్చాను. వాహన సిబ్బంది నన్ను,నాబిడ్డను సురక్షితంగా ఆసుపత్రికు చేర్పించారు అంటోంది సుజాత.

పునర్జన్మనిచ్చారు - నారాయణ, మాలపల్లి గ్రామం



నాది మంత్రాలయం మండలం, మాలపల్లి గ్రామం. గతేడాది అక్టోబర్ 4న కుటుంబ కలహాల కారణంగా అర్ధ రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోబోయాను. చావుబతుకుల మధ్య ఉన్న నా కోసం మా కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం చేరవేశారు. 10 కి.మీ.దూరంలోని కోసిగి నుంచి అంబులెన్స్ సకాలంలో వచ్చి వాహనంలోనే ఆక్సిజన్ అందించి 20 కి.మీ. దూరంలోని ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించి నా ప్రాణాలు కాపాడారు. నాకు పునర్జన్మనిచ్చిన అంబులెన్స్ సిబ్బందికి ధన్యవాదాలు తెలుపుతున్నాడు నారాయణ.

కర్నూలుకు అంబులెన్స్‌లో తీసుకెళ్లారు - సరోజ, బాధితురాలు, కోసిగి



మేం కోసిగిలోని సిద్దప్ప పాలెం కాలనీలో నివాసం ఉంటున్నాం. గతేడాది సెప్టెంబర్ 7న ఇంట్లో గ్యాస్ లీక్ కావడంతో మంటలు వ్యాపించి 80 శాతం శరీరం కాలిపోయింది. అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో ఆదోని ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో అదే అంబులెన్స్‌లో కర్నూలు ఆసుపత్రిలో చేర్పించి మెరుగైన వైద్య అందించారు. అంబులెన్స్ సకాలంలో వచ్చి ఆసుపత్రిలో చేరించి నా ప్రాణాలు రక్షించారు అంటోంది సరోజ.

నడిచే ప్రాణదాత

108..ఈ సంఖ్య వింటేనే వైఎస్సార్ గుర్తుకొస్తారు. ఆయన మానసపుత్రికగా పేరుగాంచింది కూడా.. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వీటి సేవలను విస్తృతం చేయడంతో పాటు వాటికి నూతన పరికరాలు, సాంకేతికతను జోడించి అందుబాటులోకి తేవడంతో బాధితులకు ఆపత్కాలంలో అండగా నిలిచి ప్రాణాలు కాపాడి ఎన్నో కుటుంబాలకు మేలు చేస్తున్నాయి. కోసిగి మండలంలో గతేడాది 1800 మందిని ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించాయి. అలాగే దాదాపు 30 మంది గర్భిణులు వాహనంలోనే ప్రసవం అయ్యారు. ఇలా ఎందరివో ప్రాణాలు కాపాడి నడిచే ప్రాణదాతగా వర్ధిల్లుతోంది.

- ఆపత్కాలంలో అండగా నిలుస్తున్న 108 అంబులెన్స్
- ఏడాదిలో 1800 వరకు అత్యసర సేవలు
- 30 ప్రసవాలు వాహనంలోనే..
- తల్లీబిడ్డలు సంరక్షణలో అంబులెన్స్ సిబ్బంది
- 108 సేవలపై బాధితుల హర్షం


గత నెల 21న అంబులెన్స్‌లో మగబిడ్డకు జన్మనిచ్చిన సాతనూరు మాదేవి (ఫైల్)

కోసిగి: 108 అంబులెన్స్.. ఎందరివో ప్రాణాలు కాపాడుతోంది. ఎంతో మంది క్షతగాత్రుల ఊపిరికి సంజీవనిగా నిలిచింది. నిత్యం అందుబాటులో ఉంటూ బాధితులకు అండగా నిలుస్తోంది. పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వం వాహనాల్లో నూతన ఉపకరణాలు, సాంకేతిక పరిజ్ఞానం ఏర్పాటు చేసింది. అలాగే వాహనాలు త్వరగా బాధితులను చేరుకునేలా సమీపంలో అందుబాటులో ఉంచింది. జిల్లాలో 54 అంబులెన్స్‌లు ఉన్నాయి. జిల్లాలోని మారుమూల ప్రాంతం కోసిగి మండలంలో ఏఎల్ఎస్ అంబులెన్స్ సేవల ద్వారా పలువురు ప్రాణాలు దక్కించుకున్నారు. మండలంలోని నదితీర గ్రామాలైన కడదొడ్డి, కందుకూరు, అగసనూరు, సాతనూరు, తుంబిగనూరు, మూగలదొడ్డి, చిర్తనకల్లు, సాతనూరు కొట్టాల,జంపాపురం తదిత గ్రామాల్లో మహిళలను ప్రసవ నిమిత్తం కోసిగి పీహెచ్‌సీలో చేర్పించి తల్లీబిడ్డలను కాపాడటంలో ఆపద్బాంధవుడిలా మారింది. అలాగే ఆసుపత్రిలో పురుడు పోసుకున్న తల్లీబిడ్డల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం పేదలకు వరంగా మారింది. అంబులెన్స్‌లో ఆక్సిజన్, వెంటిలేటర్‌తో కూడిన ఏర్పాట్లు చేయడంతో సేవలు మెరుగుపడ్డాయి. మండల కేంద్రానికి దాదాపు 25 కి.మీ. దూరంలో పల్లెల నుంచి వచ్చేలోపు తరచూ గర్భిణులు వాహనంలోనే ప్రసవిస్తున్నారు. ఇలా గతేడాది దాదాపు 30 మంది అంబులెన్స్‌లోనే ప్రసవించారు. అంబులెన్స్ సేవలపై బాధితులు హర్షం వ్యక్తం చేశారు.

సదుపాయాలు ఇలా..

108 అంబులెన్స్‌ల్లో పలు వాహనాలు బేసిక్ లైఫ్ సపోర్టు (బీఎల్ఎస్)కు సంబంధించినవి కాగా మరికొన్ని అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ (ఏఎల్ఎస్), ఇంకొన్ని చిన్నారుల కోసం నియోనటల్ వైద్య సేవలందించేలా రూపొందించారు. బీఎల్ఎస్ వాహనాల్లో.. స్పైన్ బోర్డు, స్కూప్ స్ట్రెచర్, వీల్ చైర్, బ్యాగ్ మస్క్, మల్టీ పారా మానిటర్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేశారు. అలాగే.. ఏఎల్ఎస్ వాహనంలో విషమ పరిస్థితిలో ఉన్న రోగిని కూడా తరలించవచ్చు. ఇందుకు అత్యాధునిక వెంటిలేటర్లు ఏర్పాటు చేశారు. ఇక నియోనేటల్ అంబులెన్స్‌లో ఇన్‌క్యుబేటర్లతో పాటు వెంటిలేటర్ కూడా అందుబాటులో ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో సమాచారమిచ్చిన 15 నిమిషాల్లో, గ్రామీణ ప్రాంతాలకు 20 నిమిషాలు, ఏజెన్సీ ప్రాంతాలకు 30 నిమిషాల్లో చేరేలా అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి అంబులెన్స్‌లో ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్ (ఈఆర్‌సీ)తో అనుసంధానంత చేయడం ద్వారా ఫోన్ చేసిన వారిని వేగంగా ట్రాక్ చేసే వీలుండే సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉంచారు. అలాగే..మొబైల్‌తో పాటు రెండు వైపులా మాట్లాడుకునేలా ఆటోమేటిక్ వెహికల్ లోకేషన్ టాండ్ (ఏవీఎల్‌టీ)బాక్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. అలాగే..గ్లోబల్ పొజిషనింగ్ విధానం కూడా ఏర్పాటు చేశారు.ఆధార్ కోసం బయోమెట్రిక్ ఉపకరణాలు, రోగుల డేటాను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసేందుకు ట్యాబ్, పర్సనల్ కంప్యూటర్ కూడా ఎంఎంయూలో అందుబాటులో ఉన్నాయి.

సేవలు అందించడంలో సంతోషం



కోసిగి అంబులెన్స్‌లో 8 ఏళ్లుగా ఈఎంటీగా పనిచేస్తున్నా. మా సొంత గ్రామం కోసిగి. ప్రాణాపాయ స్థితి నుంచి ఒకరి ప్రాణాలు కాపాడినా ఎంతో ఆనందంగా ఉంటుంది. కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెలగించి సేవలు అందించాం. - రామకృష్ణ, ఈఎంటీ, కోసిగి

ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించొద్దు



ప్రస్తుతం 108 అంబులెన్స్‌లో ఆక్సిజన్ వెంటిలేటర్‌తో కూడిన అత్యవసర పరికరాలు ఏర్పాటు చేశారు. ప్రజలు ప్రైవేట్ వాహనాలు ఆశ్రయించొద్దు. ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లేందుకూ ఈ అంబులెన్స్‌ను ఉపయోగించుకోవచ్చు. ప్రభుత్వ అంబులెన్స్, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను వినియోగించుకోండి. - చంద్రమౌళి, అంబులెన్స్ జోనల్ మేనేజర్, కర్నూలు

ఫిష్ ఆంధ్ర ఔట్‌లెట్‌లు ప్రారంభించాలి


మాట్లాడుతున్న పీడీ వెంకటసుబ్బయ్య

ఆదోని రూరల్ : మండలానికి ఐదు చొప్పున ఫిష్ ఆంధ్ర ఔట్‌లేట్లను తప్పనిసరిగా ప్రారంభించాలని, సంస్థాగత నిర్మాణంలో భాగంగా మొబైల్ బుక్ కీపింగ్, డీసీబీ, సీఐఎఫ్ తదితర వాటిలో ప్రగతి సాధించాలని డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య, డీడీ ఫిషరీస్ శ్యామల సూచించారు. పట్టణంలోని మండల సమాఖ్య సమావేశ హాల్‌లో బుధవారం ఆదోని, ఆలూరు నియోజకవర్గాల ఏసీ, ఏపీఎంలు, లబ్ధిదారులకు ఫిష్ ఆంధ్ర స్కీంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన, ప్రాజెక్టు కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రధానంగా ఫిష్ ఆంధ్ర స్కీంపై పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా వివిధ రకాల ఔట్‌లేట్లు నమూనాలు మరియు వాటికయ్యే ఖర్చు, ప్రభుత్వం ద్వారా వచ్చే సబ్సిడీ, యూనిట్ పెట్టుకోవడం ద్వారా వచ్చే లాభాలు.. తదితర అంశాల గురించి వివరించారు. జీవనోపాధుల్లో భాగంగా సీడ్ కేపిటల్ ప్రతి మండలం టార్గెట్‌ను పూర్తి చేయాలని, పెరటికోళ్లు, గొర్రెలు, పొట్టేళ్ల యూనిట్ల లక్ష్యాన్ని గడువులోపు పూర్తి చేయాలని, స్త్రీనిధి రికవరీని గడువులోపు పూర్తి చేయాలని, నిర్దేశించిన మండలాల్లో చేయూత, మహిళ మార్ట్ ప్రారంభించడానికి త్వరలో ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు. ఏపీడీ శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ తనిఖీ


బస్టాండ్‌లో సౌకర్యాలపై డీఎంతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్ : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. మరుగుదొడ్లను పరిశీలించి, టికెట్ ధరలను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులతో మాట్లాడి సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. అనంతరం డీఎం రఫీక్‌తో చర్చించారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, అలాగే బస్టాండులో ప్రయాణికులు కూర్చొనేందుకు సీట్లు ఏర్పాటు చేయాలని, పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. ఆర్టీఓ కార్యా లయ పరిపాలనాధికారి గోవిందసింగ్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

మండగిరి సచివాలయం తనిఖీ..

మేజర్ పంచాయతీ మండగిరిలోని సచివాలయం-2ను బుధవారం సాయంత్రం సబ్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో ప్రభుత్వ పథకాల బోర్డుల ఏర్పాటు, సిబ్బంది పనితీరు, బయోమెట్రిక్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీఓ గీతావాణి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

జగనన్న పాలన బహుత్ అచ్చా హై..

- పథకాల అమలుపై ముస్లింల హర్షం
- కోసిగి సచివాలయం-3లో 'గడప గడపకు మన ప్రభుత్వం'


ముస్లింలకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం/కోసిగి: ముఖ్యమంత్రి జగనన్న పాలన బహుత్ అచ్చా హై (చాలా బాగుంది).. అంటూ ముస్లింలు సంతోషం వ్యక్తం చేశారు. కులమతాలకు, పార్టీలకు అతీతంగా పథకాలు అందజేయడంపై హర్షం వెలిబుచ్చారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక సచివాలయం-3 పరిధిలోని కాలనీల్లో మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్‌రెడ్డితో కలిసిఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు ముస్లింల ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డితో తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సీఎం జగనన్న పాలనపై ప్రజలు తమ అభిమానాన్ని చూపుతున్నారన్నారు. ఆయన పాలన అద్భుతంగా సాగుతుందనడానికి గడప గడపకు కార్యక్రమంలో తమకు ప్రజల నుంచి లభిస్తున్న స్వాగతాలే నిదర్శనమన్నారు. అసంతృప్తి ఉంటే ఈ స్థాయిలో ఆదరణ లభించదని, కేవలం తమ మనుగడ కోసం ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. నవరత్నాల పథకాల అమలుతో ప్రతివర్గమూ జగనన్నను అభినందిస్తోందని చెప్పారు. మండల కేంద్రంలో నీటి ఎద్దడి నివారణ కోసం పులికనుమ ప్రాజెక్టు నుంచి నీటిని లిఫ్టు చేస్తున్నట్లు తెలిపారు. పులికనుమ ద్వారా కోసిగి ప్రాంత రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. మౌలిక వసతుల్లో భాగంగా ఇప్పటికే 24 సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించామని, 900కు పైగా ఇంటి పట్టాలు ఇచ్చిన ఘనత తమకే దక్కిందని వివరించారు.మండలానికి కొత్తగా రెండు ఎత్తిపోతల పథకాలు తీసుకొచ్చామని, పనులు జోరుగా సాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెట్టనగౌడ్, ఎంపీపీ ఈరన్న, డిస్ట్రిబ్యూటర్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి, సీనియర్ నాయకులు నాడుగేని నరసింహులు, మహంతేష్ స్వామి, యల్లయ్య, మాజీ మండల ఉపాధ్యక్షులు హాజీ ఉస్మాన్, మాణిక్యరాజు, హొళగుంద కోసిగయ్య, నాడుగేని నాగరాజు, సర్పంచ్ అయ్యమ్మ, జగదీష్ స్వామి, బండ్ల గోవిందు, మంగమ్మ, భీమక్క, ఎంపీడీఓ రాజేంద్ర, తహసీల్దార్ రుద్రగౌడ, హౌసింగ్ ఏఈ షేక్షావలి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మల్లికార్జున రెడ్డి, ఎస్ఐ రాజారెడ్డి, ఏపీఎం సత్యమ్మ, ఏపీఓ జయరాం పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం రూరల్: మండలంలోని సుంకేశ్వరి గ్రామానికి చెందిన నర్సిరెడ్డి, రచ్చుమర్రి గ్రామానికి చెందిన సుజాత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా నర్సిరెడ్డికి రూ 2.30 లక్షలు, సుజాతకి రూ.17 వేల విలువైన చెక్కులు మంజూరయ్యాయి. వాటిని రాంపురం గ్రామంలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. సర్పంచ్ ముక్కరన్న నాయకులు రఘునాథ్‌రెడ్డి, ఆంజినేయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, అయ్యప్ప ఉన్నారు.


పెద్దకడబూరు మండలం రాగిమాన్‌దొడ్డి వద్ద పచ్చని పైర్ల మధ్య ఎర్ర తివాచీలా మిరప

పంట మెరిసే.. పుడమి మురిసే

పూలతోటలు, చెరకు చేలు, వేరుశనగ, మిరప పైర్లతో నేలమ్మ నిగనిగలాడుతోంది. నియోజకవర్గంలో గత మూడేళ్లుగా మంచి వానలు కురవడంతో కాలువలు, నదీ, బోరుబావులు జలకళను సంతరించుకున్నాయి. ప్రస్తుతం రబీ సీజన్‌లో నేలతల్లి పచ్చదనంతో సోయగాలు ఒలుకుతోంది. మనసును దోచుకుంటూ రైతన్న మదిలో ఆశలు చిగురింపజేస్తున్నాయి. ఇదిగో పచ్చని హారంగా మారిన పైర్ల పరువాల దృశ్యమాలిక.. - మంత్రాలయం


మురవణి వద్ద వేసిన బంతిపూల తోట సొగసులు..


ఎల్లెల్సీ ప్రధాన కాలువ సమీపంలోని చామంతి తోట సొబగులు..


కోసిగి మండలం గౌడగల్లులో ఉల్లిపైరుపై మబ్బులు కమ్మిన దృశ్యం


జుమ్మాలదిన్నె సమీపంలో వేరుశనగ పైరు సోయగం


ఉరకుంద గ్రామంలో పచ్చగా చెరకు పైరు

కేంద్ర ప్రభుత్వం అండగా నిలవాలి


చిన్నారులకు బీమా సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి


బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని అర్బన్ : తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా అండగా నిలవాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి అన్నారు. ఎం.ఎం. కాలనీకి చెందిన సుధాకర్, తిరుపతమ్మ గతేడాది జనవరి నెలలో మృతి చెందారు. వారి పిల్లలకు బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్ బీమా మొత్తం రూ. లక్షను చిన్నారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సాధారణంగా చనిపోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష బీమా అందజేస్తుందని, కేంద్ర ప్రభుత్వం కూడా కొంత మొత్తం అందజేసి బాధితులకు అండగా నిలవాలని కోరారు. కౌన్సిలర్ చిన్నా, నాయకుడు భాస్కర్ పాల్గొన్నారు.

నూతన బస్సు సర్వీస్ ప్రారంభం

ఆదోని నుంచి కర్నూలు వరకు సింగిల్ స్టాప్ నూతన బస్సు సర్వీసును ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో బస్సు ఎక్కి బస్సును పరిశీలించి బస్సును నడిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మహ్మద్ రఫిక్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, ఏజెస్ పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

ఆదోని అర్బన్: రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో సిద్దేశ్వరం వద్ద ఐకానిక్ బ్రిడ్జికి బదులుగా రోడ్ కమ్ బ్యారేజీని నిర్మించాలని కోరుతూ ఈనెల 28వ తేదీన తలపెట్టిన చలో సిద్దేశ్వరంను విజయవంతం చేయాలని రాయలసీమ స్టీరింగ్ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఉమ్మి సలీం స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అమరావతిపైనే మాట్లాడుతున్నారని, రాష్ట్రంలో మిగిలిన సమస్యలు వారికి పట్టవని మండిపడ్డారు. రాయలసీమ ప్రజల భవిష్యత్ తరాలు బాగుండాలంటే ఉద్యమానికి సిద్ధం కావాలని కోరారు. ఆదినారాయణరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శేఖర్, మంజునాథ్, బద్రిస్వామి, నల్లారెడ్డి పాల్గొన్నారు.